# ఇరుకు గది

**జీతం తీసుకుని** స్టాఫ్ రూంలో కొచ్చింది సౌమ్య. "పి.ఎఫ్. అడ్వాన్సు అందుకున్నట్లున్నావ్. ఐదొందలు అప్పివ్వరాదూ" అభ్యర్థనగా అన్నది అపర్ణ. "అడగక అడగక సౌమ్యనే అడగాలా? ఆవిడగారి దగ్గర ఎంత సేపుండాలా డబ్బు. వాళ్ళాయన ఇప్పుడొచ్చి ఎగరేసుకుపోడూ" పరిహాసమాడింది పరిమళ.

కిసుక్కున నవ్వింది కళ్యాణి. సౌమ్యకి తలతీసేసినట్టైంది.

వాళ్ళు అనుకున్నట్లే ఆఘమేఘాలమీద వచ్చాడు ఆనంద్. భర్తను చూడగానే వంటికి అవరాసుకున్నట్టైంది సౌమ్యకి. "డబ్బు కోసం పరుగెత్తుకుంటూ స్కూలుకు రాకపోతే ఇంటకొచ్చే వరకు ఆగొచ్చుగా! పదిమందిలో పరువు తీయడానికి కాకపోతే మరిదేనికి?..."

ఆ మాటే ఇంటికొస్తూనే భర్తతో అన్నది వ్యానిటీ బ్యాగు అతడి ముఖాన విసిరికొడుతూ.

"సారీ డియర్, అంతమాత్రనికే ఇంత ఆగ్రహమా? జీతం రోజున అందరూ బదులివ్వ మంటారు. నువ్వెక్కడ మొహమాటానికి పోతావోనని..." అంటూ బ్యాగులో నోట్లు తీసి జేబులో కుక్కుకున్నాడు.

"నెల నెలా జీతం పట్టుకొచ్చి భర్త చేతిలో పోయడమే తప్ప తన ఖర్చుల కోసం అంతో ఇంతో అట్టే పెట్టుకోవడం ఏనాడు ఎరుగదు సౌమ్య. అంతే కాదు అతడి ఆర్జనతో పాటు తన జీతం కూడా పట్టుకెళ్ళి ఏంచేస్తున్నాడని ఎన్నడూ ఆరాతీసిన పాపాన పోలేదు. అత్త ఆడబడుచులు అందరూ ఉన్న పెద్దకుటుంబం తనది. ఏవో ఖర్చులుంటాయి అనుకునేది.

లీవు లెటరు హెడ్ మిస్ట్రస్‌కి ఇమ్మని చెప్పడానికొచ్చి "ఇంత చిన్న కొంపలో మీరెలా ఉంటున్నారే? మీకంటూ ప్రత్యేకంగా ఓ బెడ్‌రూమ్ కూడా ఉన్నట్లు లేదు. ఇద్దరూ సంపాదిస్తూ ఎందుకంత కనికిష్టంగా బ్రతకడం? ఏదైనా పెద్దపోర్షను తీసుకోరాదూ" అంది అపర్ణ.

నిజమే పెళ్ళై మూడేళ్ళవుతున్నా తనకా ఆలోచనే స్ఫురించలేదు. వచ్చింతర్వాత ఊరుకోగలదా? అందుకే 'ఇల్లు మార్చండి. మనకో బెడ్‌రూము కూడా ఉండాల'ంది.

"ఇంత కంటే పెద్ద పోర్షను తీసుకోవాలంటే ఎంత అవుతుందో తెలుసా?" అడిగాడు ఆనంద్ భార్య మాటలకు విస్తుపోతూ.

"ఎంతైతేనేం? ఇద్దరం సంపాదిస్తున్నాం.

"మనది పెద్ద కుటుంబం"

"అందుకే పెద్ద ఇల్లు చూడమంటున్నాను" "నువ్వన్నది బాగానే ఉంది. ఉన్నదంతా ఇంటికే తగలేస్తే అందరి అవసరాలు ఎలా తీరుతాయి?"

"అందరి అవసరాలతో పాటు మన అవసరాల్ని కూడా గుర్తుంచుకోమంటున్నాను. రెక్కలు ముక్కలు చేసుకుని సంపాదిస్తోంది ఈ ఇరుకు గదిలో మగ్గడానికి కాదు"

ఉన్నట్లుండి భార్యలో వచ్చిన ఈ హఠాత్పరిణామానికి అమితాశ్చర్యపోయాడు ఆనంద్.

ఇది ఆమెకు పుట్టిన బుద్ధికాదు. ఎవరో నూరిపోసుంటారు. అందుకే మరి సమాధానమివ్వలేదు.

మగడు తన మాటను లక్ష్యపెట్టనందుకు ఉక్రోషం తన్నుకొచ్చింది సౌమ్యకి. ఆ రోజంతా ఇరువురిది ఎడమోహం పెడమొహమే అయింది.

నాటి నుండి ఆదాయానికి, వ్యయానికి బేరేజు వేసుకోసాగింది సౌమ్య. అత్త, ఆడబడుచులు, మరిది తను తన భర్త వెరసి ఆరుగురు సభ్యులు. పట్టుమని పదిమందైనా లేని కుటుంబంలో పదివేలు ఖర్చవుతున్నాయంటే నమ్మశక్యంగా లేదు. ఒక జీతం ఇంటి ఖర్చులకు వినియోగిస్తూ, మరో జీతాన్ని విలాసాలకు వెచ్చిస్తున్నాడేమోనన్న సందేహం కలిగింది. అనుమానమనేది రాకనే పోవాలి. వచ్చిందంటే అది మనిషిని దహించి వేస్తుంది. అందుకు ప్రతి సంఘటన అగ్నికి ఆజ్యమే అవుతుంది అనేది అక్షరసత్యం. ప్రతిరోజూ పెనిమిటి ఆలశ్యంగా ఇంటికి రావడం ఆమె అనుమానాన్ని మరింత ధృడపరిచింది. అంతేకాదు మ్యారేజ్‌డే జరుపుకుందామని మురిపెంగా అడిగితే అలాగే అంటూ ఓ నలుగురైదుగురు స్నేహితుల్ని మాత్రమే పిలవమని చెప్పి తను మాత్రం గైరుహాజరయ్యాడు.

వచ్చిన అతిథులకు ఏంపెట్టాలో తెలియక, అత్త వేయించి ఇచ్చిన బఠాణీలనే ప్లేట్లో పెట్టి తెచ్చింది. "పెళ్ళి రోజున కూడా ఈ కేటిల్ ఫుడ్ ఏమిటే? మంచి స్పెషల్ ఏమైనా చేయించి పెడతావేమో అనుకుంటే" అంటూ హేళన చేసారు మిత్ర బృందం.

వారి మాటలకు చిన్నబుచ్చుకుంది సౌమ్య. మొగుడిమీద పీకల వరకు కోపం వచ్చింది. మరి ఉండలేక ఆనంద్ ఇంటికిరావడంతోనే మాటలతో అతడిని కడిగేసింది.

అతని అహం దెబ్బతిన్నది. ఏదో అన్నాడతడు. ఆమేదో అన్నది. మాట మాట పెరిగింది.

ఇల్లాలి నిందల్ని, నిష్టూరాల్ని భరించలేక మనసు విప్పాడు ఆనంద్.

అయిష్టంగానే శ్రోతయ్యింది సౌమ్య.

★ ★ ★

ఊరంతా తిరిగి కొంపకొచ్చిన కొడుకుతో "ఇల్లేదైనా దొరికిందా? కుతూహలంగా అడిగింది వర్ధనమ్మ.

"లేదు నాన్న పరిస్థితి చూసి ఎవ్వరూ ఇల్లు ఇవ్వనంటున్నారు" అన్నాడు ఆనంద్.

"వాళ్ళకదేం పోయేకాలంరా? రోగం రొష్టు ఎవరికి రావు" అన్నది ఆగ్రహంగా.

"నాన్న ఉన్నట్లుండి ఎక్కడ కన్నుమూసేస్తారోనని వాళ్ళ భయం"

'మాయదారి రోజులు మాయదారి మనుషులు. ఎవరు మాత్రం ఎంత కాలం ఉట్టిగట్టుకుని ఊరేగుతారు? గుండ్రాయిలా ఉన్న వాళ్ళు కూడా గుట్టు చప్పుడు కాకుండా గుటుక్కుమంటున్నారు"

"నిజమే. అయినా మనమేం చేస్తాం? వాళ్ళ భయం వాళ్ళది" అన్నాడు ఆనంద్.

"అదిసరే ఇంటిగలాయన ఉన్నపళంగా ఇల్లు ఖాళీ చేసేయమంటున్నాడు. ఇప్పుడేది దారి?" వర్ధనమ్మ మాటలతో ఆందోళన ధ్వనిస్తోంది. "కాస్త గడువిమ్మని అతడినే బ్రతిమాలు కుందాం. ఇంతకీ నాన్నకలా ఉంది?" అని అడిగాడు.

"ఏమిటో మూసిన కన్ను తెరవడం లేదు. పదిసార్లు పిలిస్తే ఒకసారి పలుకుతున్నారు. నాకు భయంగా ఉంది" అన్నది గుండెలోతుల్లోంచి ఉబికి వస్తున్న దుఃఖాన్ని దిగమింగుకుంటూ.

"కంగారు పడకు. డాక్టర్ని పిలుచుకొస్తాను" అని చెప్పి వెళ్ళిపోయాడు ఆనంద్.

"అమ్మా! అబ్బాయి వచ్చినట్లుంది. ఇల్లు ఏదైనా దొరికిందా?" అంటూ లోపలకొచ్చాడు ఇంటి యాజమాని నూకరాజు.

"లేదండి. దానికోసమే వాడు కాళ్ళకు బలపం కట్టుకుని తిరుగుతున్నాడు. దొరకగానే వెళ్ళిపోతాం" ప్రాధేయపూర్వకంగా అన్నది వర్ధనమ్మ.

"నీకేవమ్మా ఎన్నైనా చెబుతావు. రేపు ఆయన 'హరీ' అంటే నా పాట్లు కుక్కలు కూడ పడవు" "శివ శివ అవేం మాటలండి" అన్నది వర్ధనమ్మ చెవులు మూసుకుంటూ.

"ముందు అటు చూడమ్మా... అతగాడికి ఎగశ్వాస వచ్చేస్తున్నట్లుంది. నీకు చేతులెత్తి దండం పెడతాను. ఇంటిమాట అటుంచి అతణ్ణి బయట పడుకోబెట్టండమ్మా. ధనిష్టలు దగ్గర పడిపోతున్నాయి. ఇల్లు మూసేయవలసి వస్తుందేమో! నా ఆదాయానికి గండి కొట్టకు తల్లి. రేయ్, రంగా!... రవణా! ఎక్కడున్నార్రా. త్వరగా వచ్చి ఆ మనిషిని కాస్త సాయంపట్టి వీధిలో పడుకోబెట్టండర్రా..." కప్పు ఎగిరేటట్లు అరిచాడు నూకరాజు.

"మీ కాళ్ళు పట్టుకుంటాను. ఆపని మాత్రం చేయకండి. ఇంట్లో అబ్బాయి కూడా లేడు. జబ్బు మనిషిని రోడ్డుమీద పడేయడం అమానుషం" అంటోంది వర్ధనమ్మ.

ఆమె ఆక్రందనను ఆలకించే స్థితిలో లేదు నూకరాజు.

అతడి ఆదేశానుసారం ఇద్దరు వస్తాదుల్లాంటి వ్యక్తులొచ్చి ఆమె భర్తను అవలీలగా పైకెత్తి రోడ్డుమీద పడుకోబెట్టారు.

ఆ దృశ్యాన్ని చూడలేక కళ్ళుమూసుకుంది వర్ధనమ్మ.

డాక్టర్ని వెంటేసుకొచ్చాడు ఆనంద్. వీధిలో ఉన్న తండ్రిని చూసి చలించిపోయాడు. "రోగి ప్రాణానికి ఇప్పుడప్పుడే ముప్పులేదు. లోపలికు తీసుకెళ్ళండి" అన్నాడు డాక్టర్.

గబగబా చెల్లెళ్ళ సహాయంతో తండ్రిని లోపలకు తీసుకెళ్ళి మంచంమీద పడుకోబెట్టాడు ఆనంద్.

ఏమనాలో తెలియక గుడ్లప్పగించి చూస్తూ నిలబడి పోయాడు నూకరాజు.

★ ★ ★

"చచ్చిపోతాడేమో అనే అనుమానంతో బ్రతికి వున్న నాన్నని మంచం దింపి ఎన్ని మార్లు రోడ్డున పడేసామో లెక్కలేదు. మా అవస్థను చూడలేనన్నట్లు కన్ను మూసాడు కన్నతండ్రి. ఇంట్లో కర్మ చేయడానికి వీల్లేదనన్నాడు నూకరాజు. ఇల్లు వాడిది కాబట్టి వాడిష్టం. అందుకే సత్రంలోనే ఆ తంతు నంతా పూర్తి చేసాను. సానుభూతి, సహకారం కొరవైన ఈ సంఘంలో ప్రతి ఒక్కరికీ సొంత యిల్లు ఎంత అవసరమో నాటి అనుభవం నాకు చాటిచెప్పింది. నాన్నకు పట్టిన గతి అమ్మకు పట్టకూడదు. అలాగే నీకు, నాకు మరెవ్వరికీ ఆదుర్గతి దాపురించకూడదు.

అందుకు మనకంటూ ఓ గూడు ఉండితీరాలి. చెల్లెళ్ళకు పెళ్ళిళ్ళు ఆలస్యమైనా పర్వాలేదు. మనం ఒక పూట తిన్నా కొంప మునిగిపోదు. సొంత గూడు మాత్రం అనివార్యం. అందుకు నీ నా అనే బేధం లేకుండా సంపాదిస్తున్న ప్రతి పైసా పోగు చేస్తున్నాను. అదనపు రాబడికోసం ఆఫీసు అయిపోగానే బయట దుకాణాల్లో పద్దులు రాస్తున్నాను. ఆడదానికి అనుమానం ఎక్కువంటారు అందుకు నీవేమాత్రం తీసిపోవని నువ్వు నిరూపించుకున్నావు. అందుకే మరి ఉండలేక మనసులో దాచుకున్నదాన్ని చెపుతున్నాను."

"క్షమించండి మీ అంతరంగం తెలియక తొందరపడ్డాను. మీ ఉద్దేశ్యం మాట మాత్రంగానైనా నాతో చెప్పి ఉంటే మన మధ్య కలతలకు ఆస్కారం ఉండేది కాదు. నా సహకారం కూడా మీకు పూర్తిగా ఉండేది" ఆర్తిగా అన్నది సౌమ్య.

"అవసాన దశలో అవసరమయ్యే సొంత ఇంటికోసం ఇప్పటి నుంచే కోరికలను కట్టుకోవడం దేనికన్న బాధను నువ్వెక్కడ వెలిబుచ్చుతావో అని నీతో చెప్పలేదు".

"పోన్లెండి మబ్బులు వీడాయ్. మనసులు కలిసాయ్." అంది సౌమ్య గలగలా నవ్వుతూ. ఆ నవ్వులో హాయిగా శృతికలిపాడు ఆనంద్.

**5 మార్చి 2000 ఆంధ్రప్రభ డైలి - ఆదివారం అనుబంధం)**